సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం । 4 । ఫిబ్రవరి । 2023



22కిలోల గంజాయి స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని బొమ్మూరు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.



ఉత్కంఠగా..

'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలు ఆద్యంతం ఉత్కంఠగా జరుగుతున్నాయి. - 8లో

డెల్టాలకు 5,970 క్యూసెక్కులు




ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 5,970 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,760, మధ్య డెల్టాకు 1,145, పశ్చిమ డెల్టాకు 3,065 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.55 అడుగులకు చేరింది.

ఈ గాలీ.. ఈ నేల..

- కె.విశ్వనాథ్ కళాతపస్సు సాగించిందిక్కడే..
- ఈ ప్రాంతంలో అడుగడుగునా ఆయన అడుగు జాడలు
- కళాతపస్వి మృతితో కన్నీటి పర్యంతమైన గోదారమ్మ

వెండితెరపై కళా 'సిరివెన్నెల'లు కురిపించిన దిగ్గజ సినీ దర్శకుడు కె.విశ్వనాథ్ సినీ 'శృతిలయలు'.. అడుగడుగునా గోదారి సీమతో జత కట్టాయి. ప్రేక్షకుల గుండెల్లో 'సిరిసిరిమువ్వల' సవ్వడిని ఘల్లుమంటూ వినిపించాయి. ఆ సినీ 'స్వర్ణకమలం'.. 'స్వయం కృషి'తో ప్రకాశిస్తూ.. మరుగున పడిపోతున్న కళారంగంపై 'స్వాతికిరణం' ప్రసరించదానికి ఈ నేలమ్మే వేదికగా నిలిచింది. ఆ కళాతపస్వి ఆలోచనల నుంచి రూపుదిద్దుకుని, జాతీయ స్థాయిలో మెరిసి, మురిపించిన 'శంకరాభరణం' మెరుగులు దిద్దుకున్నదీ ఇక్కడే. ఆ విశ్వనాథుడు సాగించిన సినీ 'కళాతపస్సు'.. అడుగడుగునా ఈ గాలి.. ఈ నేల.. ఈ ఊరు.. ఇక్కడి సెలయేరుతో ముడిపడిపోయింది. ఆ కళామతల్లి ముద్దుబిడ్డ ఇక లేరని తెలిసిన గోదారి సీమ.. కన్నీటి కెరటాల్లో మునిగిపోయింది.



రత్నగిరి మెట్ల దారిపై..

అన్నవరం: శంకరాభరణం సినిమాలోని కొన్ని కీలక సన్నివేశాలను దర్శకుడు విశ్వనాథ్ అన్నవరం రత్నగిరిపై చిత్రీకరించారు. తర్వాత సూత్రధారులు, స్వాతికిరణం, శుభప్రదం సినిమాలు కూడా అన్నవరంలో చిత్రీకరించారు. శంకరాభరణం సినిమాలో హీరో చంద్రమోహన్ రత్నగిరి మెట్ల దారిలో మరచెంబు పారేయడం, హీరోయిన్ రాజ్యలక్ష్మి పట్టుకుని హీరోకు ఇవ్వడం అప్పట్లో చాలా గమ్మత్తయిన సన్నివేశం. ఇప్పటికీ మెట్ల దారి వెంట వెళ్లే పాతతరం వారు ఈ సన్నివేశాన్ని గుర్తు చేసుకుంటారు. ఈ సినిమాలో ఒక పాటతో పాటు కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. సూత్రధారులు సినిమాలో హీరో భానుచందర్ కలెక్టర్ అయ్యాక సత్యదేవుని దర్శనానికి మెట్ల దారిలో వస్తున్నప్పుడు పాట తీశారు. స్వాతికిరణం సినిమాలో 'కొండా కోనల్లో లోయల్లో..' అనే పాట పంపా తీరం నేపథ్యంలో సాగుతుంది.



శంకరాభరణం: రత్నగిరి మెట్ల దారిలో హీరో చంద్రమోహన్, నిర్మలమ్మ



పంపా తీరాన 'శుభప్రదం' షూటింగ్‌లో..



సిరివెన్నెల చిత్రం లోకేషన్‌లో దర్శకుడు కె.విశ్వనాథ్

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): సినీ ప్రస్థానంలో విశ్వనాథ్ తొలి అడుగులు తూర్పు గోదావరి జిల్లా నుంచే ప్రారంభించారు. మూగమనసులు సినిమాకు దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు దగ్గర విశ్వనాథ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశారు. ఆవిధంగా ఇక్కడి గోదావరితో తొలిసారిగా అనుబంధం ఏర్పడింది. అందుకే ఆయన దర్శకత్వం వహించిన ఎక్కువ చిత్రాల్లో గోదావరి కనిపిస్తుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఆయన ఏకంగా 27 సినిమాలు చిత్రీకరించారు. అంటే ఆయన కెరీర్‌లో సగానికి పైగా చిత్రాలు ఇక్కడ షూటింగ్ చేసినవే. 'స్వాతిముత్యం' షూటింగ్ తంటికొండలో 18 రోజుల పాటు చేశారు. 'శారద' సినిమా గుమ్మళ్లదొడ్డి, సిరిసిరిమువ్వ చిత్రాలను రాజమహేంద్రవరం సారంగధరేశ్వరస్వామి ఆలయంలో చిత్రీకరించారు.

కోటిపల్లిలో శ్రీకారం

రామచంద్రపురం: కళాతపస్వి విశ్వనాథ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా తన సినీ ప్రస్థానాన్ని కె.గంగవరం మండలం కోటిపల్లిలో శ్రీకారం చుట్టారు. రాజమహేంద్రవరానికి చెందిన సినీ దిగ్గజం ఆదుర్తి సుబ్బారావు వద్ద తొలి నాళ్లలో పని చేశారు. 1963లో కోటిపల్లి, కోట పరిసర ప్రాంతాల్లో మూగమనసులు సినిమా షూటింగ్ చేశారు. కోటిపల్లి రేవులో షూటింగ్‌ల బాధ్యతలను విశ్వనాథ్ చూసేవారు. అమలాపురం బస చేసి రోజూ కోటిపల్లికి వచ్చేవారు. ఆయనతో ఈ ప్రాంతానికి చెందిన ప్రముఖ నిర్మాత, పూర్ణోదయ క్రియేషన్స్ అధినేత ఏడిద నాగేశ్వరరావుతో పాటు ఇక్కడి నిర్మాతలు ఉజూరి వీర్రాజు బ్రదర్స్, భాస్కర్‌రెడ్డి (పసలపూడి) సన్నిహితంగా ఉండేవారు. సిరిసిరిమువ్వ చిత్రం షూటింగ్ రామచంద్రపురంలో దాదాపు 20 రోజులు జరిగింది. ప్రధాన రహదారితో పాటు పసలపూడి తదితర ప్రాంతాల్లో షూట్ చేశారు. రామచంద్రపురం ట్రావెలర్స్ బంగ్లాలో విశ్వనాథ్ బస చేసేవారు. తీరిక సమయంలో స్నేహితులు, స్థానికులతో కలిసి షటిల్ బ్యాడ్మింటన్ కూడా ఆడేవారు.

'పూర్ణోదయ'తో అపూర్వ చిత్రాలు

ఏడిద నాగేశ్వరరావుతో పరిచయమే విశ్వనాథ్ సినీ ప్రస్థానాన్ని పెద్ద మలుపు తిప్పింది. ఈ బ్యానర్ కింద నిర్మించిన చిత్రాలన్నీ కళాఖండాలుగా నిలిచాయి. 1980లో శంకరాభరణం చిత్రం నిర్మాణానికి నిర్మాత ఏడిదను కలిశారు. అప్పటికే రెండు మూడు చిత్రాలతో చేయి కాల్చుకున్న ఆయన కొంత తటపటాయించినా ఓకే చెప్పారు. జాతీయ స్థాయిలో అవార్డుల పంట పండించి, తెలుగు సినిమాను ఉన్నత శిఖరాలపై నిలిపిన శంకరాభరణం షూటింగ్ రామచంద్రపురంలోని రాజుగారి చినకోటలో చేశారు. ఈ సినిమాలోని ఇతర సన్నివేశాలను గోకవరం పరిసరాల్లో చిత్రీకరించారు. ఆయన దర్శకత్వంలో రూపుదిద్దుకున్న సిరిసిరిమువ్వ, శంకరాభరణం, సాగరసంగమం, స్వాతిముత్యం, స్వయంకృషి, స్వాతికిరణం తదితర చిత్రాలు వెండితెరపై చెరగని ముద్ర వేశాయి. కళతో ముడిపడిన ఈ చిత్రాల షూటింగుకు ఆయన ఉమ్మడి గోదావరి జిల్లాలోని పలు ప్రాంతాలను ఎంచుకున్నారు.

ఆ కోటలో ఎన్ని షూటింగులో..

కళాతపస్వి దర్శకత్వంలో పాటలతో ఒక ఊపు ఊపేసిన 'సిరివెన్నెల' సినిమాకు రామచంద్రపురం నిర్మాత ఉజూరి వీర్రాజు నిర్మాణ సారథ్యం వహించారు. కోటిపల్లి రేవులోను, ధవళేశ్వరం, రాజమహేంద్రవరం సారంగధరమెట్ట ప్రాంతాల్లో ఈ సినిమా షూటింగ్ జరిగిందని నిర్మాత వీర్రాజు గుర్తు చేసుకుని కంటతడి పెట్టారు. విశ్వనాథ్ తీసిన మరో మాస్టర్ పీస్ స్వాతికిరణం సినిమా షూటింగ్ కూడా ఇక్కడి రాజుగారి పెద్ద కోటలో చేశారు. చేనేత కార్మిక బతుకులు ఇతివృత్తంగా 1984లో విశ్వనాథ్ తీసిన 'జననీ జన్మభూమి' చిత్రం షూటింగ్ రామచంద్రపురం మండలం అద్దంపల్లిలో 30 రోజుల పాటు జరిగింది. విశ్వనాథ్‌కు ఎంతో పేరు తీసుకువచ్చిన 'సూత్రధారులు' సినిమా కూడా రామచంద్రపురం పరిసరాల్లో తీశారు. ఇక్కడ షూటింగ్ అంటే ఆయన ఎంతో ఇష్టపడేవారని స్థానికులు చెబుతూంటారు. హిందీలో రీమేక్ చేసిన 'జీవనజ్యోతి' సినిమాకు సంబంధించిన రథం సీను పసలపూడిలో చిత్రీకరించారు.

'సిరివెన్నెల' తొలిపాట విన్నది ఇక్కడే

అమలాపురం టౌన్: 'జననీ జన్మభూమి' చిత్రం షూటింగ్ 1984లో అమలాపురం పరిసర గ్రామాల్లో జరుగుతోంది. విశ్వనాథ్ అమలాపురంలో - మిగతా 8లో

50 ఏళ్ల అనుబంధం



శారద సినిమా నుంచి విశ్వనాథ్‌తో పరిచయం ప్రారంభమైంది. ఆయనతో దాదాపు 50 ఏళ్ల అనుబంధం. ప్రతి సినిమాలో వేషం ఇచ్చేవారు. జయపద్ర పుట్టిన రోజుకు రాజమహేంద్రవరంలో కచేరీ చేస్తుంటే ఆయన చూసి.. శంకరాభరణంలో ర్యాప్ గాయకుడిగా అవకాశం ఇచ్చారు. ఆ పాత్ర నాకు ఎంతో పేరు తెచ్చింది. సప్తపది సినిమాలో నేను, నా కుమార్తె.. గోవుల్లు తెల్లన, గోపయ్య నల్లన.. అనే పాటలో నటించాం. ఆ పాత్రకు మా అమ్మాయికి అవార్డు కూడా వచ్చింది.

- శ్రీపాద జిత్‌మోహన్‌మిత్ర, సీనియర్ నటుడు

చిత్ర సీమకు తీరని లోటు



దర్శకుడు కె.విశ్వనాథ్ రామచంద్రపురం వస్తే నాకు కబురు పెట్టేవారు. ఆయనతో కలిసి సిరిసిరిమువ్వ, సిరివెన్నెల చిత్రాలు నిర్మించాం. ఆయనతో మంచి అనుబంధం ఉండేది. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అందుకున్న తరువాత ఆయన ఇంటికి వెళ్లి సత్కరించాను. ఆ సందర్భంగా నన్ను చూసి 'నా నిర్మాతలు వచ్చారు' అంటూ ఆయన ఎంతో గౌరవంగా మాట్లాడారు. ఆయన మృతి చిత్రసీమకు తీరని లోటు.

- ఉజూరి వీర్రాజు, సినీ నిర్మాత, రామచంద్రపురం

న్యూస్‌రీల్

2.645 మెట్రిక్ టన్నుల ఎరువుల సీజ్

అమలాపురం టౌన్: పట్టణంలోని శివశక్తి ఓం ట్రేడర్స్ ఎరువుల దుకాణంలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. స్టాక్ నిల్వల్లో వ్యత్యాసం ఉండటంతో పాటు గరిష్ట అమ్మకం ధరకు మించి అమ్ముతున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఆ దుకాణంపై 6ఏ కేసు నమోదు చేశారు. రూ.71,671 విలువైన 2.645 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. ఫాక్ట్ కంపెనీ ఎరువుల గరిష్ట ధర రూ.1,390 ఉండగా ఈ దుకాణంలో రూ.1,400కు అమ్ముతున్నారని గుర్తించారు. దీనిపై లీగల్ మెట్రాలజీ అధికారులు కూడా కేసు నమోదు చేశారు. శివశక్తి ఓం ఎరువుల దుకాణానికి వాస్తవ ఎరువుల సరఫరాదారులైన స్థానిక శ్రీ కోదండ రామ ఫెర్టిలైజర్స్ స్టాక్ రిజిస్టర్లను కూడా అధికారులు తనిఖీ చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఫారెస్ట్ రేంజ్ అధికారి వలీ, అమలాపురం మండల వ్యవసాయాధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.

15 కేంద్రాల్లో రేపు ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

అమలాపురం టౌన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరుగుతుందని డీఈఓ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. జిల్లా వ్యాప్తంగా 15 కేంద్రాల్లో 3,220 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాయనున్నారు. అమలాపురంలో 7, కొత్తపేటలో 4, రామచంద్రపురంలో 4 చొప్పున కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను డీఈఓ ఎస్‌వీ రవిసాగర్ శుక్రవారం సమీక్షించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు పరీక్ష మార్గదర్శకాలపై శిక్షణ ఇచ్చారు.

విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే రావాలి. 10 గంటల తర్వాత వస్తే పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు ఎవ్వరూ సెల్‌ఫోన్ వాడకూడదు. విద్యార్థులు ఎటువంటి ఎల్రక్టానిక్ పరికరాలూ తమ వెంట తీసుకు రాకూడదు. ఓఎంఆర్ బబ్లింగ్ కోసం బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్నులు మాత్రమే ఉపయోగించాలని విద్యార్థులకు సూచించారు.

ఆదిదేవునికి వేదాశీర్వచనం

- ఏకశిలా మండపంలో పండిత సదస్యం
- హనుమద్, సింహ వాహనాలపై ఘనంగా గ్రామోత్సవాలు



సదస్యం నిర్వహిస్తున్న అర్చకులు, వేద పండితులు



హనుమద్వాహనంపై గ్రామోత్సవం

సఖినేటిపల్లి: కల్యాణ శోభతో మెరిసిపోతున్న ఆదిదేవునికి.. లోక సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ అర్చకులు వేదమంత్రోచ్చారణలతో ఆశీర్వచనాలు పలికారు. లక్ష్మీనృసింహస్వామి వారి వార్షిక దివ్య తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఏడో రోజైన శుక్రవారం సదస్యం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి వేద పండితులు, అర్చకులు ఆశీర్వచనాలు పలికే ఘట్టమే సదస్యం. ఆలయంలోని ఏకశిలా మండపంలో ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు నిర్వహించిన ఈ కార్యక్రమం ఆద్యంతం భక్తులను అలరించింది. తొలుత మండపంలో పుష్పాలతో అలంకరించిన సింహాసనంపై నూతన దంపతులైన స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చారు. ప్రధానార్చకుడు కిరణ్, స్థానాచార్య రంగాచార్యులు, వేద పండితుడు వేంకటశాస్త్రి, దేవస్థానం అర్చకులు, పేరూరు వేద పండితులు పి.విశ్వనాథంశర్మ, ఎం.సత్యనారాయణ, ఎస్.సూరిబాబు, నేమాన మూర్తి, ఎ.మూర్తి తదితరులు విష్వక్సేన పూజ, మండపారాధన, సప్తర్షి పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామగోపాల రాజా బహద్దూర్, ఉత్సవ సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆలయంలో స్వామివారికి ప్రముఖ వ్యాపారవేత్త జంపన సత్యనారాయణరాజు, వసుధ ఫౌండేషన్ ప్రతినిధి జంపన బుజ్జిరాజు పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం హనుమద్వాహనం, రాత్రి సింహవాహనంపై స్వామివారికి అర్చకులు గ్రామోత్సవాలు నిర్వహించారు. తొలుత ఆలయం నుంచి పల్లకీలో స్వామి, అమ్మవార్లను అలంకార మండపానికి తోడ్కొని వచ్చారు. అక్కడ పూలతో అలంకరించారు. వాహనాల వద్ద ప్రముఖులు, అర్చకులు కొబ్బరి కాయలు కొట్టి గ్రామోత్సవాలకు శ్రీకారం చుట్టారు. మాడ వీధుల్లో వాహనాలపై స్వామి ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

అంతర్వేదిలో నేడు

ఉత్సవాల్లో భాగంగా శనివారం వేకువజామున 5 గంటలకు సుప్రభాత సేవ, 6.30 గంటలకు తిరువారాధన, బాలభోగం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు. సాయంత్రం 4 గంటలకు రాజాధిరాజ వాహనం, రాత్రి 7 గంటలకు అశ్వవాహనంపై గ్రామోత్సవాలు నిర్వహిస్తారు. 8 గంటలకు 16 స్తంభాల మండపం వద్ద చోరసంవాదం ఘట్టం నిర్వహిస్తారు.

సీతమ్మా.. దయ ఏదమ్మా!

- రైల్వేకు అరకొర కేటాయింపులు
- కోటిపల్లి – నర్సాపురం రైల్వే లైనుకు రూ.100 కోట్లు
- కొవ్వూరు – భద్రాచలం లైనుకు రూ.20 కోట్లు
- కాకినాడ మెయిన్ లైన్ ఊసే లేదు



కోటిపల్లి - శానపల్లిలంక మధ్య నిర్మిస్తున్న రైల్వే వంతెన

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు అరకొర కేటాయింపులతో కేంద్ర బడ్జెట్ ఉసూరుమనిపించింది. ప్రధానంగా పలు పెండింగ్ రైల్వే ప్రాజెక్టులకు దండిగా నిధులు వస్తాయనే ఆశలపై నీళ్లు చల్లింది. కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారమే పార్లమెంటులో ప్రవేశపెట్టినా.. రైల్వే కేటాయింపులపై శుక్రవారం రాత్రికి కానీ స్పష్టత రాలేదు. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన పలు కీలక డిమాండ్లకు ఈ బడ్జెట్‌లో మోక్షం లభించలేదు. కొన్నింటిని అరకొర కేటాయింపులతో సరిపెట్టారు.

- కీలకమైన కోటిపల్లి – నర్సాపురం రైల్వే లైను నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో రూ.100 కోట్లు మాత్రమే కేటాయించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలను అనుసంధానం చేసే ఈ ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లో కనీసం నాలుగైదు వందల కోట్ల రూపాయలు కేటాయిస్తారని ఆశ పడ్డారు. 22 ఏళ్ల క్రితం రూ.645 కోట్లతో మొదలైన ఈ రైల్వే లైన్ అంచనా వ్యయం ప్రస్తుతం రూ.2,892 కోట్లకు పెరిగింది. దీనికి తగినట్టుగా కేటాయింపులు లేవని కోనసీమ వాసులు పెదవి విరుస్తున్నారు. కేటాయింపులు ఎక్కువగా ఉంటాయని, 57 కిలోమీటర్ల రైల్వే లైను కోసం గౌతమి, వశిష్ట, వైనతేయ గోదావరి పాయలపై నిర్మాణంలో ఉన్న మూడు వంతెనల పనులు వేగం అందుకుంటాయని అందరూ ఆశించారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం కేటాయించిన రూ.100 కోట్లు ఏ మూలకు వస్తాయని ప్రశ్నిస్తున్నారు. ఆశించిన స్థాయిలో కేటాయింపులు చేస్తే వైనతేయపై బోడసకుర్రు – పాశర్లపూడి మధ్య మందకొడిగా జరుగుతున్న తొమ్మిది పిల్లర్ల పనులు ఊపందుకునేవని అంటున్నారు. పెండింగ్‌లో ఉన్న 528 ఎకరాల భూసేకరణకు కూడా ఈ కేటాయింపులు సరిపోవనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వాసులను దశాబ్దాలుగా ఊరిస్తున్న కాకినాడ – పిఠాపురం మెయిన్ లైన్ ఊసే బడ్జెట్‌లో లేకుండా పోయింది. ఈ రైల్వే లైను కోసం నాలుగు దశాబ్దాలుగా అలుపెరగని ప్రయత్నం చేస్తున్నా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కనికరించ లేదు. కాకినాడ మెయిన్ లైన్ నిర్మాణానికి రూ.40 కోట్లతో 22 ఏళ్ల క్రితమే గ్రీన్ సిగ్నల్ లభించింది. కాకినాడ పోర్టు ద్వారా దక్షిణ మధ్య రైల్వేకు భారీ ఆదాయం వస్తున్నా మెయిన్ లైన్ నిర్మాణం అంశాన్ని బడ్జెట్‌లో ప్రస్తావించకుండా ఈ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేశారని పలువురు అంటున్నారు.
- ఉమ్మడి గోదావరి జిల్లాల ప్రజలు రాములోరి సన్నిధికి వెళ్లేందుకు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న కొవ్వూరు – భద్రాచలం రైల్వే లైనుకు కేవలం రూ.20 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులిపేసుకున్నారు. 151 కిలోమీటర్ల నిడివి కలిగిన ఈ ప్రాజెక్టును 2012–13లో రూ.1,445 కోట్లతో ఆమోదించారు. అనంతరం అంచనాలు రూ.2,154.83 కోట్లకు చేరాయి. దీనికి ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించకపోవడంపై ఈ ప్రాంత వాసులు కేంద్ర ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.
- కొత్త రైళ్లకు హాల్టులు సహా పలు ప్రాజెక్టులపై ఈ బడ్జెట్‌లో ఎటువంటి స్పష్టతా కనిపించలేదు.

నాడు తండ్రి.. నేడు తనయుడు

- ఆమె ఉన్నత చదువుకు గతంలో వైఎస్సార్ అండ
- ప్రస్తుతం అక్కరకు వచ్చిన జగనన్న విదేశీ విద్యా దీవెన



టేకుమూడి నిరోషాదేవి

సాక్షి అమలాపురం: ఉన్నత చదువులు చదవాలన్నదే ఆమె లక్ష్యం. అది తల్లిదండ్రులకు భారమవుతోందని ఆమె ఆలోచిస్తున్న సమయంలో నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఆమెకు అక్కరకు వచ్చింది. తిరిగి ఇన్నాళ్ల తరువాత ఆమె విదేశీ విద్యకు నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన 'జగనన్న విదేశీ విద్యా దీవెన' పథకం వరంలా మారింది. రామచంద్రపురం మండలం తాళ్లపాలానికి చెందిన నిరోషాదేవి చదువుల ప్రస్థానమిది. కాజులూరు మండలం ఉప్పుమిల్లికి చెందిన టేకుమూడి సత్యనారాయణ, నీలవేణి దంపతుల కుమార్తె నిరోషాదేవి. పదో తరగతిలో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించింది. ఇంటర్‌మీడియెట్‌లో 95 శాతం మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచింది. తండ్రి ఆర్థిక పరిస్థితి రీత్యా ఇంజినీరింగ్ చేయాలనే తన కలను ఎలా నెరవేర్చుకోవాలో తెలియక మధనపడేది. ఆ పరిస్థితుల్లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం నిరోషాదేవికి అక్కరకు వచ్చింది. ఈ పథకం సహకారంతో ఇంజినీరింగ్ విద్య పూర్తి చేసింది. ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం చేస్తూండగా 2016లో తాళ్లపాలెం గ్రామానికి చెందిన కట్టా శార్వాణిని వివాహం చేసుకుంది. మగ బిడ్డకు జన్మనివ్వడంతో కెరీర్‌కు విరామం తీసుకుంది. తరువాత విదేశాల్లో ఎంబీఏ చదవాలనే తన చిన్ననాటి కోరికను తన భర్తకు అత్తమామలకు చెప్పింది. వారి ప్రోత్సాహంతో పట్టుదలగా చదివి యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్‌లో ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో సీటు సాధించి, కలను నెరవేర్చుకుంది.

రాష్ట్రానికి ఉపయోగపడేలా..

జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం మొదటి విడత నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విదేశాల్లో చదువుతున్న విద్యార్థుల బ్యాంక్ ఖాతాలకు శుక్రవారం జమ చేశారు. తాడేపల్లి నుంచి వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌తో నిరోషాదేవి మాట్లాడారు. బాగా చదువుకొని మంచి స్థాయికి వెళ్లి, రాష్ట్రానికి ఉపయోగపడేలా భవితను తీర్చిదిద్దుకోవాలన్నదే తన లక్ష్యమని ఆమె చెప్పింది.

ఉన్నత విద్య కల నెరవేరుస్తున్న ప్రభుత్వం

కలెక్టర్ శుక్లా విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనేది ప్రతి విద్యార్థి కల అని.. దానిని రాష్ట్ర ప్రభుత్వం నెరవేరుస్తోందని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి జిల్లాలో ముగ్గురు విద్యార్థులు అర్హత సాధించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులకు కలెక్టర్ చెక్ అందజేశారు. ఈబీసీ కేటగిరీలో కరుటూరి తనూజ్ వెంకట సత్య శ్రీధర్‌కు యూఎస్‌ఏలో చదువుకుగాను మొదటి విడతగా రూ.5,99,097, బీసీ–బికి చెందిన రామచంద్రపురం మండలం తాళ్లపాలానికి చెందిన నిరోషాదేవికి మొదటి విడతగా రూ.7,54,740, మట్ట సాయి ఫణి రవి రామనాయుడుకు యూఎస్‌ఏలో పీజీ కోర్స్ చదివేందుకు మొదటి విడతగా రూ.6,02,600 చొప్పున వారి ఖాతాల్లో జమ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి టి.వెంకటేశ్వర్లు, సాంఘిక సంక్షేమ శాఖ కార్యనిర్వాహక అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం చెక్ అందిస్తున్న కలెక్టర్ శుక్లా

క్లుప్తంగా

పాస్టర్‌పై హత్యాయత్నం


దాడిలో గాయపడిన పాస్టర్ విలియమ్స్

సామర్లకోట: పీబీ దేవం గ్రామంలో ఓ పాస్టర్‌పై గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నం చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పాస్టర్ విలియమ్స్ గురువారం అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్నాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి కొడవలితో దాడి చేశాడు. ఆయన మెడ, పొట్ట, చేతిపై కత్తిగాట్లు పడ్డాయి. చేతి వేళ్లు తెగిపోయాయి. విలియమ్స్ కాలితో నెట్టివేయడంతో దాడి చేసిన వ్యక్తి బయట పడిపోయాడు. వెంటనే విలియమ్స్ తలుపులు వేసేసుకొని ప్రాణాలు రక్షించుకున్నాడు. ఉదయం స్థానికులు పరిస్థితి తెలుసుకొని పాస్టర్‌ను కాకినాడ ఆస్పత్రికి తరలించారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై టి.సునీత సంఘటన ప్రదేశానికి చేరుకున్నారు. దాడి చేసిన వ్యక్తి వివరాలను క్షతగాత్రుడు విలియమ్స్ చెప్పలేకపోతున్నాడని ఎస్సై తెలిపారు. పాస్టర్‌కు భార్య లేరు. కుమార్తె, కుమారుడు ఇతర ప్రాంతాల్లో ఉండటంతో ఈయన ఒంటరిగా ఉంటున్నారు. ఎస్సై సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో ప్రొవిజినల్ మెరిట్ లిస్టు

కాకినాడ క్రైం: నేషనల్ హెల్త్ మిషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది విడుదల చేసిన 152 పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా ప్రొవిజినల్ మెరిట్ లిస్టు సిద్ధం అయింది. ఈ జాబితాను ఎన్‌ఐసీ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతిప్రభ తెలిపారు. ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య తన కార్యాలయంలో అభ్యర్థులు తమ అభ్యంతరాలను సమర్పించాలని సూచించారు.

ఉత్కంఠగా..

- కొనసాగుతున్న ఎస్‌పీఎల్ క్రికెట్ పోటీలు
- దూకుడుగా ఆడుతున్న క్రీడాకారులు

రాజానగరం: 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యాన రాజమహేంద్రవరం గైట్ ఇంజినీరింగ్, కాకినాడ రంగరాయ వైద్య కళాశాలల క్రీడా మైదానాల్లో నిర్వహిస్తున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలు ఆద్యంతం ఉత్కంఠగా జరుగుతున్నాయి. బ్యాట్ పట్టుకుని బరిలోకి దిగుతున్న క్రీడాకారులు ప్రతి బంతికీ ఫోర్లు, సిక్సర్లు కొట్టేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తుండగా.. ప్రత్యర్థి జట్టులోని క్రీడాకారులు వారి దూకుడుకు వికెట్లు కొల్లగొడుతూ వారి దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఈ పోటాపోటీ వాతావరణంలో ఏ జట్టు విజయం సాధిస్తుందోననే ఉత్కంఠ ప్రేక్షకుల్లో నెలకొంది. మొత్తంమీద ఈ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి.

- రాజమహేంద్రవరం గైట్ కళాశాల మైదానంలో పోటీల ఐదో రోజైన శుక్రవారం క్వార్టర్ ఫైనల్స్ జరిగాయి. ఉదయం జరిగిన మొదటి మ్యాచ్‌లో గైట్ డిగ్రీ, జీఎస్ఎల్ ఫిజియోథెరపీ కళాశాలల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన గైట్ టీమ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. **తొలుత బ్యాటింగ్ చేసిన జీఎస్ఎల్ టీమ్ నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 63 పరుగులు చేసింది. గైట్ జట్టులో అను ప్రవీణ్ 2 ఓవర్లలో 9 పరుగులిచ్చి, 3 వికెట్లు, లోకేష్ 2 ఓవర్లలో 8 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం** బ్యాటింగ్ చేసిన గైట్ జట్టు 7.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని అధిగమించి, 6 వికెట్ల తేడాతో విజయబావుటా ఎగురవేసింది. బి.మణికంఠ 16 బంతుల్లో 31 పరుగులు చేసి టీమ్ విజయానికి తోడ్పడ్డాడు.
- రెండో మ్యాచ్ జీఎస్ఎల్ డెంటల్, మెడికల్ కళాశాలల జట్ల మధ్య హోరాహోరీగా సాగింది. టాస్ గెలిచిన మెడికల్ కాలేజీ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన డెంటల్ కాలేజీ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 80 పరుగులు **చేసింది. రవి 19 బంతులకు 34 పరుగులు** తీసి జట్టు స్కోరును పెంచాడు. తదుపరి బ్యాటింగ్ చేసిన మెడికల్ కాలేజ్ జట్టు 6.3 ఓవర్లలో కేవలం ఒక్క వికెట్టు నష్టానికి లక్ష్యాన్ని అధిగమించి, 9 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. ఈ జట్టులో కుతుబ్ 18 బంతులకు 40, సునీల్ 18 బంతులకు 27 పరుగులు చేసి, జట్టు విజయంలో భాగస్వాములయ్యారు.
- గైట్ ఇంజినీరింగ్, మదర్స్ డిగ్రీ కాలేజీ జట్ల మధ్య మధ్యాహ్నం జరిగిన మూడో మ్యాచ్ కూడా చివరి వరకూ నువ్వా నేనా అన్నట్టుగా సాగింది. టాస్ గెలిచిన గైట్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన మదర్స్ డిగ్రీ కాలేజీ జట్టు నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 91 పరుగులు చేసింది. ఈ జట్టులో సాయి 15 బంతులకు 20 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన గైట్ కళాశాల జట్టు విజయం కోసం చివరి వరకూ అలుపెరుగని పోరాటం చేసింది. 9.5 ఓవర్లలో 82 పరుగులు చేసి ఆలౌటైంది. మదర్స్ డిగ్రీ కాలేజీ టీమ్ విజేతగా నిలిచింది.
- ఈ పోటీలకు అంపైర్లుగా కె.దినేష్‌కుమార్, సూర్య, స్కోరర్‌గా రత్నకుమార్ వ్యవహరించారు.


మొదటి విజేత గైట్ డిగ్రీ కాలేజీ టీమ్


రెండో మ్యాచ్ గెలిచిన జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ జట్టు


మూడో మ్యాచ్ విజేత మదర్స్ డిగ్రీ కాలేజీ టీమ్

ఉత్సాహంగా..

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రంగరాయ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఉల్లాసంగా జరిగాయి.

- మొదటి మ్యాచ్‌లో ఐడియల్-ఎ, ఐడియల్-బి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఐడియల్-బి జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 60 పరుగులు చేసింది. అరుణ్, సుదర్శన్ చెరో 12 పరుగులు చేశారు. ఐడియల్-ఎ జట్టులోని బౌలర్లు మురళి, శివ చెరొక వికెట్ పడగొట్టారు. 61 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన ఐడియల్-బి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 62 పరుగులు సాధించి, 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ జట్టులోని సాయినాథ్ 18, శ్రీకర్ 16 పరుగులు సాధించారు. ఐడియల్-ఎ జట్టులోని బౌలర్లు వంశీ, రేమండ్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు.
- రెండో మ్యాచ్‌లో ఆదిత్య ఇంజినీరింగ్, జేఎన్‌టీయూకే జట్లు పోటీ పడ్డాయి. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న జేఎన్‌టీయూకే జట్టు 10 ఓవర్లలో 10 వికెట్ల నష్టానికి 78 పరుగులు చేసింది. రాంప్రసాద్ 42, ఉదయ్ 15 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆదిత్య ఇంజినీరింగ్ జట్టు 6 వికెట్ల నష్టానికి 79 పరుగులు చేసి, 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆదిత్య జట్టులోని బ్యాట్స్‌మన్ చంద్రశేఖర్ 34, నందు 17 పరుగులు చేశారు.
- మూడో మ్యాచ్‌లో ఆదిత్య ఇంజినీరింగ్, ఐడియల్-ఎ జట్లు తపడ్డాయి. టాస్ గెలిచిన ఐడియల్-ఎ జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 10 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 140 పరుగులు సాధించింది. ఈ జట్టులోని చైతన్య 76, మురళి 37 పరుగులు చేశారు. ఆదిత్య జట్టులోని బౌలర్లు కిరణ్ 2, వంశీ ఒకటి చొప్పున వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఆదిత్య జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి, 69 పరుగులు మాత్రమే సాధించింది. ప్రకాష్ 16 పరుగులు చేశాడు. దీంతో ఐడియల్-ఎ జట్టు 71 పరుగుల భారీ స్కోర్‌తో విజయం సాధించింది.
- మ్యాచ్‌లను సాక్షి సీనియర్ యాడ్ మేనేజర్ వెంకటేశ్వరరావు, క్రికెట్ కోచ్ చార్లి పర్యవేక్షించారు.


మొదటి మ్యాచ్ విజేత ఐడియల్-ఎ జట్టు


రెండో మ్యాచ్ గెలుపొందిన ఆదిత్య-ఎ జట్టు


మూడో మ్యాచ్‌ను సొంతం చేసుకున్న ఐడియల్-ఎ జట్టు

రూ.1.21 కోట్ల పోస్టల్ నిధుల గోల్‌మాల్‌పై రగడ

- అమలాపురం హెడ్‌పోస్టాఫీసు వద్ద ఉద్రిక్తత
- అజ్ఞాతం వీడి విచారణకు వచ్చిన సతీష్
- అతడిని నిలదీసిన బాధిత ఉద్యోగులు, కుటుంబీకులు

అమలాపురం టౌన్: అయినవిల్లి మండలం విలస సబ్ పోస్టాఫీసులో గత ఏడాది మే మొదటి వారంలో జరిగిన రూ.1.21 కోట్ల నిధుల గోల్‌మాల్‌కు సంబంధించి అమలాపురం హెడ్ పోస్టాఫీసు వద్ద శుక్రవారం రాత్రి ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నిధుల దుర్వినియోగానికి సంబంధించి అప్పట్లో ప్రాథమికంగా 10 మంది ఉద్యోగులను బాధ్యులుగా గుర్తించారు. వీరిలో ఇద్దరిని సస్పెండ్ చేశారు. మరో ఎనిమిది మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ కేసును సీబీఐ విచారిస్తోంది. అయితే ఈ నిధుల దుర్వినియోగంలో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న అమలాపురం ప్రధాన తపాలా కార్యాలయం సిస్టమ్స్ అడ్మిన్ (ఎస్ఏ) సీహెచ్‌వీ సతీష్ అప్పటి నుంచీ అజ్ఞాతంలో ఉన్నాడు. శుక్రవారం సాయంత్రం తండ్రితో కలసి అతడు హెడ్ పోస్టాఫీసుకు వచ్చాడు. అతడి నుంచి పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ విశ్వేశ్వరరావు స్టేట్‌మెంటు రికార్డు చేసి, విచారించారు.

పెల్లుబికిన నిరసన

సతీష్ కార్యాలయానికి వచ్చాడన్న సమాచారం తెలుసుకున్న 10 మంది బాధిత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు హెడ్ పోస్టాఫీసుకు చేరుకున్నారు. స్టేట్‌మెంట్ రికార్డు ప్రక్రియ పూర్తయ్యాక కార్యాలయం పై అంతస్తు నుంచి కిందకు వస్తే నిలదీయాలని కాచుకుని కూర్చున్నారు. పరిస్థితి గమనించిన సతీష్ భయపడో లేక బెదిరించాలనో నాటకీయంగా మూడో అంతస్తు పైకి వెళ్లిపోయాడు. బాధిత కుటుంబాల మహిళల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు రంగప్రవేశం చేశారు. సతీష్‌ను అదుపులోకి తీసుకుని, అక్కడి నుంచి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆ సమయంలో బాధితులు పెద్ద ఎత్తున అతడిపై ధ్వజమెత్తారు. 'నీ వల్లే మేం అన్ని రకాలుగా నష్టపోతున్నాం.. కాజేసిన సొమ్ములు రికవరీ చేయాలి' అంటూ పెద్ద పెట్టున డిమాండ్ చేశారు. 'ఇన్నాళ్లూ ఎక్కడికి వెళ్లావు' అంటూ నిలదీశారు. డబ్బులు ఎప్పుడు తిరిగి చెల్లించేది లిఖితపూర్వక హామీ ఇవ్వాలని పట్టుబట్టినా అందుకు సతీష్ ససేమిరా అన్నాడు. దీంతో అతడిపై బాధితులు మరింత మండిపడ్డారు.

హెచ్‌ఎం ఆత్మహత్య

నిడదవోలు రూరల్: పట్టణంలోని రాయిపేటకు చెందిన ప్రధానోపాధ్యాయుడు డీవీ శ్రీనివాసరావు (56) శుక్రవారం తాళ్లపాలెం వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు కథనం ప్రకారం.. దేవరపల్లి మండలం చిన్నాయగూడెం జెడ్పీ హైస్కూలులో ఆయన ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఆయన అనారోగ్య కారణాలతో ఆత్మహత్య చేసుకున్నట్టు చెబుతున్నారు. శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు తెలిపారు.

ప్రతిభ చూపే తరుణమిదే..

- రేపు ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్ష
- ఉమ్మడి జిల్లాలో రాయనున్న 9,498 మంది
- పూర్తయిన ఏర్పాట్లు

రాయవరం: ఆర్థికంగా వెనుకబడిన, ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఉపకార వేతనాలు అందిస్తోంది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ పూర్తయ్యే వరకూ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పేరుతో నెలకు రూ.వెయ్యి చొప్పున ఏడాదికి రూ.12 వేల ఉపకార వేతనం ఇస్తోంది. దీనికి అర్హత పొందేందుకు ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్ష జరుగుతుంది.

9,498 మంది విద్యార్థులు

ఈ ఏడాది ఈ ప్రవేశ పరీక్షకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 9,498 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులందరికీ ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ పరీక్షపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆయా పాఠ్యాంశాల్లో శిక్షణ ఇస్తూ పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

ప్రశ్న పత్రం ఇలా..

ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్ష 180 మార్కులకు ఉంటుంది. ఇందులో 90 మార్కులకు రీజనింగ్, జనరల్ నాలెడ్జ్, మెంటల్ ఎబిలిటీ, జనరల్ ఇంగ్లిష్ ఉంటాయి. మరో 90 మార్కులకు 7వ తరగతి, 8వ తరగతి గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలపై ప్రశ్నలుంటాయి. పరీక్షకు మూడు గంటల సమయం ఇస్తారు.

మొదటి పేపరులో..

మెంటల్ ఎబిలిటీ (వెర్బల్, నాన్ వెర్బల్) పేపరు 90 మార్కులకు ఉంటుంది. నంబర్ సిరీస్ 10, సింపుల్ అర్థమెటిక్ 10, మిస్సింగ్ క్యారెక్టర్స్ 10, వర్డ్ ఎనాలజీ 10, లెటర్ సిరీస్ 10 మార్కులకు ఉంటాయి. నాన్ వెర్బల్ నుంచి 30 మార్కులకు ప్రశ్నలుంటాయి.

రెండో పేపరులో 7వ తరగతి కీలకం

రెండో పేపరు కూడా 90 మార్కులకు ఉంటుంది. ఇందులో గణితం 20, సైన్స్‌లో పీఎస్‌కు 10, కెమిస్ట్రీ 10, బయాలజీ 10, సోషల్ సబ్జెక్టులో భూగోళం 10, చరిత్ర 10, పౌరశాస్త్రం 10, అర్థశాస్త్రం నుంచి 10 మార్కులకు ప్రశ్నలుంటాయి. ఏడో తరగతి పూర్తిగా, 8వ తరగతి నవంబరు సిలబస్ వరకూ చదివి ఉండాలి. కొన్ని జనరలైజ్డ్ బిట్లు, సబ్జెక్టు మీద, అదనపు సమాచారం, కరెంట్ ఎఫైర్స్‌పై కూడా తగిన పరిజ్ఞానం కలిగి ఉండాలి. 180 నిమిషాల్లో 180 బిట్లు పూర్తి చేయాలి.

సమయం సద్వినియోగం చేసుకుంటే..

పేపర్-1లో సమయాన్ని సద్వినియోగం చేసుకుని వేగంగా సమాధానాలు రాసి, అక్కడ మిగిలిన సమయాన్ని పేపర్-2లో గణితానికి వినియోగించుకుంటే విజయం చాలా సులభమని నిపుణులు చెబుతున్నారు. ఒక ప్రశ్నకు ఒక నిమిషం మాత్రమే సమయం ఉంటుంది. ప్రశ్నపత్రంలో 60 మార్కులు సులభంగా, 60 మార్కులు మధ్యస్థంగా, 60 మార్కులు కఠినంగా ఇచ్చే అవకాశముంటుంది. సులభమైన ప్రశ్నలతో పాటు, మధ్యస్థంగా ఉన్న ప్రశ్నలకు సమాధానాలు రాబడితే విజయం తథ్యమవుతుంది. కనీసం 130 మార్కులు దాటిన వారికి విజయావకాశాలు మెండుగా ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు. ప్రశ్న, దానికి ఇచ్చిన నాలుగు సమాధానాలు కచ్చితంగా చదివి, సరైన దానిని నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే బబ్లింగ్ చేయాలి. ప్రతి ప్రశ్నకూ సమాధానాన్ని దాని ఎదురుగా బబ్లింగ్ చేయాలి. ఓఎంఆర్ షీటు మీద అదనంగా ఏమీ రాయకూడదు.

ఏర్పాట్లు పూర్తి

ఈ నెల 5వ తేదీన నిర్వహించే ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా విద్యాశాఖ పూర్తి చేసింది. జిల్లాల వారీగా నిర్దేశించిన కేంద్రాల పరిధిలోని పోలీస్ స్టేషన్లలో పరీక్ష పేపర్లు భద్రపరిచారు. సీఎస్, డీఓల నియామకం పూర్తి చేసి, పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించేందుకు సూచనలు చేశారు.

జిల్లాల వారీగా పరీక్ష కేంద్రాలు, కేటాయించిన విద్యార్థులు

జిలా	కేంద్రాలు	విద్యార్థులు
కోనసీమ	15	3,220
కాకినాడ	15	3,667
తూర్పు గోదావరి	11	2,611
మొత్తం	41	9,498

అదనపు తరగతులు


ఎన్ఎంఎంఎస్ పరీక్షకు టీచర్లు రోజూ అదనపు తరగతి నిర్వహించి మమ్మల్ని సన్నద్ధం చేస్తున్నారు. నాలుగు నెలలుగా పాఠశాలలో ఉదయం, సాయంత్రం ప్రిపేర్ అవుతున్నాం. కచ్చితంగా విజయం సాధిస్తాననే నమ్మకం ఉంది.
– చిరట్ల లీలా శ్రీమహాలక్ష్మి, 8వ తరగతి విద్యార్థిని, వెంటూరు, రాయవరం మండలం

ఏటా శిక్షణ ఇస్తున్నాం


ఎన్ఎంఎంఎస్‌లో అర్హత సాధించడం పేద విద్యార్థులకు ఒక వరం. ఐదేళ్లుగా ఏటా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం. ఈ ఏడాది కూడా ప్రతి రోజూ అదనపు తరగతులు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇచ్చాం.
– మేడవరపు గోపాలకృష్ణ, ఎస్ఏ (బీఎస్), జెడ్పీ హైస్కూలు, వెల్ల, రామచంద్రపురం మండలం

పకడ్బందీ ఏర్పాట్లు


ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకున్నాం.
– బి.రమణశ్రీ, అసిస్టెంట్ కమిషనర్, ప్రభుత్వ పరీక్షల విభాగం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

ఈ గాలీ.. ఈ నేల..

7వ పేజీ తరువాయి ▶

బస చేశారు. నాడు పీఅండ్‌టీగా వ్యవహరించే ఇప్పటి బీఎస్ఎన్ఎల్‌లో చేంబోలు సీతారామశాస్త్రి అప్పట్లో కాకినాడలో పని చేసేవారు. అనేక కవితలతో ఆయన ఆకట్టుకునేవారు. ఆయన రాసిన 'గంగావతరణం' గీతం ఆనోటా ఈనోటా విశ్వనాథ్ తెలుసుకున్నారు. సీతారామశాస్త్రి గురించి ఆరా తీశారు. వెంటనే సీతారామశాస్త్రి అమలాపురం వచ్చి తొలిసారి విశ్వనాథ్‌ను కలిశారు. అప్పుడే 'జననీ జన్మభూమి' చిత్రంలో ఓ పాట రాసే అవకాశాన్ని సీతారామశాస్త్రికి ఇచ్చి సినీ గేయ రచయితగా విశ్వనాథ్ అరంగ్రేటం చేయించారు. తర్వాత 1986లో విశ్వనాథ్ తెరకెక్కించిన 'సిరివెన్నెల' చిత్రానికి వర్ధమాన గేయ రచయిత కోసం అన్వేషిస్తున్న సమయంలో కళాతపస్వి మదిలో సీతారామశాస్త్రి మెదిలారు. ఒక పాట విని, అన్ని పాటలూ ఆ సినిమాకు సీతారామశాస్త్రి చేత రాయించారు. సినిమాతో పాటు పాటలూ సూపర్ హిట్ అయి సీతారామశాస్త్రి ఇంటి పేరును 'సిరివెన్నెల'గా మార్చేశాయని సినీ గేయ పరిశోధకుడు, కవి డాక్టర్ పైడిపాల గుర్తు చేశారు.


సిరివెన్నెల చిత్రం యూనిట్‌తో విశ్వనాథ్

కపిలేశ్వరపురంలో 'సూత్రధారులు'

కపిలేశ్వరపురం: 1989లో విడుదలైన 'సూత్రధారులు' సినిమాను సుమారు 40 రోజుల పాటు కపిలేశ్వరపురంలోనే చిత్రీకరించారు. 80 శాతం సన్నివేశాల్లో కపిలేశ్వరపురం, తాతపూడి, కోరుమిల్లి గ్రామాల గోదావరి తీర ప్రాంతాలు, జమీందారీ భవనాలు, వేద పాఠశాల, వ్యవసాయ క్షేత్రాలు, పురాతన గృహాలు కనిపిస్తాయి. షూటింగ్ సందర్భంగా తమను సినిమా నిర్మాణ పనుల్లో భాగస్వాములను చేశారని ఇక్కడి గ్రామస్తులు చెబుతారు. ప్రతినాయకుడు నీలకంఠం పాత్రధారి కైకాల సత్యనారాయణ ఇంటిగా జమీందారీ దివాణంలోని ముందు భాగాన్ని చిత్రీకరించారు. హరికథా భాగవతారిణి పాత్రలో నటించిన కేఆర్ విజయ ఇల్లుగా తన ఇంటినే చిత్రీకరించారని గ్రామానికి చెందిన కమ్మ వెంకట్రావు తెలిపారు.


సిరివెన్నెల చిత్రం లోకేషన్‌లో దర్శకుడు కె.విశ్వనాథ్

'జీవనజ్యోతి', 'జీవితనౌక' చిత్రీకరణ

కొత్తపేట: ప్రముఖ నిర్మాత డీవీఎస్ రాజుకు రావులపాలెం మండలం వెదిరేశ్వరం శివారు కోసూరి నగర్‌కు చెందిన సమితి మాజీ అధ్యక్షుడు కోసూరి రామకృష్ణంరాజు కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దాంతో కోసూరి నగర్, వెదిరేశ్వరం, దేవరపల్లి పరిసర ప్రాంతాల్లో పచ్చని పంటలు, కొబ్బరి తోటలు, పంట కాలువలతో కళకళలాడే లొకేషన్స్‌లో విశ్వనాథ్ పలు చిత్రాలు తీశారు. 1977లో 'జీవనజ్యోతి' చిత్రం షూటింగ్ ఈ ప్రాంతంలో జరిగింది. తరువాత 'జీవితనౌక' సినిమా కూడా ఇక్కడే తీశారు.